


# వేడి

కె.వి.యస్. వర్మ

ప్రభాకరం పట్నంలో పన్లు చూసుకుని ఫస్ట్‌షో సినిమాకెళ్ళాడు. సినిమా చూసిన తర్వాత హాలు ఎదురుగా వున్న కాంటీన్‌లో టీ తాగి బయటకు వచ్చాడు. సిగరెట్ వెలిగించి తృప్తిగా పొగ పీల్చి స్కూటర్ స్టార్ట్‌చేసి బయలుదేరాడు తన పల్లెటూరికి. అతని వూరు ఆ పట్నానికి ఓ పాతికమైళ్ళు వుంటుంది.

ప్రభాకరం స్కూటర్ని స్పీడుగా పోనిస్తున్నాడు. పట్నం దాటి చాలా దూరం వచ్చేశాడు. రోడ్డుమీద జన సంచారం అసలులేదు. అప్పుడో లారీ అప్పుడో లారీ మాత్రం వెళ్తున్నాయి. చీకటి చిక్కగా వుంది. రోడ్డు కిరువైపులా చెట్లు చల్లని గాలి నిస్తూ తలలూపుతున్నాయి.

స్కూటర్ లైట్ కాంతిలో చాలా దూరంలో ఓ స్త్రీ చెయ్యి వూపుతూ కనిపించింది. ప్రభాకరానికి ఆ క్షణంలో పుట్టింటికి పురిటికి వెళ్ళిన పెళ్ళాం మనసులో మెదిలింది. దూరంగా చెయ్యి వూపుతూ నిలబడిన ఆ స్త్రీ అందంగా వుంటే బావుండుననుకున్నాడు. ఆ స్త్రీ




యింక కొన్ని గజాల దూరంలో వుంది.

ప్రభాకరం స్కూటర్ని స్లో చేశాడు. సుమారు ఐను మైళ్ళు పోయేదాకా ఏ వూహా తగలదు. ఆమె లిఫ్టు కోసమే చెయ్యి వూపుతోందా... లేక తన కోసమే వూపుతోందా... ప్రభాకరం ఆలోచిస్తున్నాడు ఆమె దేనికోసం చెయ్యి వూపినా ఆమె అందంగా వుంటే మాత్రం నెమ్మదిగా బుట్టలో వెయ్యాలి అనుకున్నాడు.

ప్రభాకరం ఆమె దగ్గరికి రాగానే సడన్ బ్రేక్ వేసి ఆగాడు. ఆమెనిచూశాను అందంగా ఆకర్షణీయంగా వుంది. ప్రభాకరం నరాలు వేడెక్కిపోయాయి. తనకి లభిస్తూన్న అదృష్టానికి మురిసి పోయాడు.

"ఎంతవరకూ వెళ్తున్నారు ? రండి. వెనుక సీటుమీద కూర్చోండి," అన్నాడు ఆమెని తన వలలో ఎలా వేసుకుని, ఆమెని అనుభవిద్దామా అని ప్లాన్ వేసుకుంటూ మనసులో.

ఆమె చిన్నగా అందంగా నవ్వింది. అలాగే నిలుచుని వుండి నవ్వుతూ చూసింది ప్రభాకరాన్ని. ముందుకు రాలేదు.

మరుక్షణంలో ప్రభాకరం త్రుళ్ళి పడ్డాడు. శరీరం నిండా చెమటలు పట్టే శాయి. నోరు పిడచగట్టుకుపోయింది. నరాల్లోని వేడి ఒక్కసారిగా చల్లబడి పోయింది. ఆమె నవ్వినందుకు కాదు—

"నీ దగ్గరున్న డబ్బంతా బేగా యిత్తావా, మా సేతుల్లో సత్తావా" అంటూ చెట్లచాటునుంచి వచ్చి, కర్రలు పట్టుకుని యమభటుల్లా నిలబడ్డ ఆమె తరపు మనుషుల్ని చూసి.